క్లుప్తంగా

గిరిజన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



నెల్లూరు(బారకాసు): నగరంలోని అనుగుంటలో ఉన్న గిరిజన భవన్‌లో అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్, ఏకలవ్య ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఆదివారం ప్రదానం చేశారు. జిల్లా కలెక్టర్ ఆనంద్, మేయర్ స్రవంతి పాల్గొని, మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చదువుకోవాలని, భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వాహకులు బషీర్, వేణును అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



నెల్లూరు (టౌన్): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అర్బన్ ఎంఈఓ అబ్దుల్‌హమీద్ తెలిపారు. స్థానిక వెంగళరావునగర్ మున్సిపల్ హైస్కూల్లో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. తొలుత ఎన్‌సీసీ క్యాడెట్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజులవాణి, విశ్రాంత ఉపాధ్యాయుడు సత్యంరాజు, ఎన్‌సీసీ అధికారులు నరేంద్రబాబు, నాగరాజు, ఉపాధ్యాయులు ఖాదర్‌మస్తాన్, స్కూల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో మెడికల్ క్యాంప్



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. వైద్యులు సత్యనాథ్, శ్రీధర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యుల సహకారంతో సుమారు 300 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. కిలారి తిరుపతినాయుడు దాతగా వ్యవహరించారు.

శాస్త్రీయ సమాజానికి జేవీవీ కృషి



ఎన్నికైన జేవీవీ నూతన కమిటీ సభ్యులు

నెల్లూరు(అర్బన్): శాస్త్రీయ సమాజం కోసం జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందని ఆ వేదిక జాతీయ నాయకుడు డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశ మందిరంలో జిల్లా మహాసభ ఆదివారం జరిగింది. సైన్సు ఫలాలు సామాన్యులకు అందాలన్నారు. అనంతరం డాక్టర్ వీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో జేవీవీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గౌస్‌బాషా, బాలకోటేశ్వరరావు, కోశాధికారిగా గీతాంజలి, గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ రవితో పాటు మరి కొందరిని ఎన్నుకున్నారు.

హామీలను అమలు చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భవన నిర్మాణ సంఘం రూరల్ కమిటీ మహాసభ నగరంలోని వేదాయపాళెం మన్సూర్ భవన్‌లో ఆదివారం నిర్వహించారు. జిల్లా భవన నిర్మాణ సంఘం కార్యదర్శి అల్లాడి గోపాల్ పాల్గొని, మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీలో 27 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, గౌరవాధ్యక్షుడిగా ప్రసాద్, అధ్యక్ష, కార్యదర్శులుగా రంగయ్య, ఖలీల్‌లను నియమించారు.

తెలుగు పరిరక్షణపై 12, 13 తేదీల్లో సదస్సు

నెల్లూరు(బృందావనం): ఈనెల 12, 13వ తేదీల్లో కర్నూలులో రాష్ట్ర స్థాయి తెలుగుభాషా పరిరక్షణ సదస్సు ఉంటుందని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పి.అన్నపూర్ణ తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిర ప్రాంగణంలోని కళావేదికపై ఆదివారం ఆవిష్కరించారు. తెలుగుభాషా పరిరక్షణకు కవులు, కళాకారులు, రచయితలు, విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎ.జయప్రకాష్, టి.శశికళ, ఎం.లక్ష్మి, మోహన్‌రాజు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సందడే సందడి

నెల్లూరు నగరంలో రొట్టెల పండగ సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం భక్తులు పోటెత్తారు. బారాషహీద్‌లను దర్శించుకునేందుకు క్యూ కట్టారు. ఇది రోడ్డుపైకి వచ్చేసింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు



గుర్తుగా సెల్ఫీ



విద్యుద్దీపాల వెలుగులో..

దర్గా ఆవరణలో వైద్యశిబిరాలు

నెల్లూరు(అర్బన్): రొట్టెల పండగ నేపథ్యంలో బారాషహీద్ దర్గా వద్ద పలువురు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. దుర్గా ఆస్పత్రి అధినేత డాక్టర్ పల్లంరెడ్డి యశోధర ఆధ్వర్యంలో దర్గా ఆవరణలో ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. పలువురు భక్తులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. డాక్టర్ అంజలి, భాను, కరీష్మా, భవాని పాల్గొన్నారు.

➡ నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో దర్గా వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నారాయణ మెడికల్ ఇన్‌స్టిట్యూషన్స్ అదనపు వైద్య సూపరింటెండెంట్ దొరసానమ్మ ఈశిబిరాన్ని ప్రారంభించారు. ఆస్పత్రి ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

➡ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దర్గా ఆవరణలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. సంస్థ ఎంసీ మెంబర్ దాసరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 100 మంది వలంటీర్లు పని చేస్తున్నారన్నారు.



ఏఎస్పీకి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

వైఎస్సార్‌సీపీ కార్యవర్గ సభ్యులకు సన్మానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గంలో జాయింట్ సెక్రటరీలుగా నియమితులైన హంసకుమార్, కె.బాలకృష్ణారెడ్డిలను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీకి అంకితభావంతో పనిచేస్తామన్నారు. ఈ అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి, రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డికి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



ఎమ్మెల్సీతో బాలకృష్ణారెడ్డి

➡ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన నందిరెడ్డి బాలకృష్ణారెడ్డి నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆదివారం సిటీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మీయ సన్మానం



చొప్పా రవీంద్రబాబుకు సన్మానం

నెల్లూరు(అర్బన్): రెవెన్యూ, వైద్యశాఖలో ఉద్యోగులుగా, ఏపీజీఈఏ నాయకులుగా పనిచేసి గత వారంలో పదవీ విరమణ పొందిన చొప్పా రవీంద్రబాబు, ఏనుగు రమణారెడ్డి, యడవల్లి మల్లికార్జున, గునుపాటి శ్రీనివాసులురెడ్డి, ఎ.గిరిజల సన్మాన సభ ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ పాల్గొని, మాట్లాడారు. శేషజీవితం హాయిగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్షుడిగా ఏనుగు రమణారెడ్డి, కార్యదర్శిగా మల్లికార్జునను ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా విరాటపర్వం



చప్పరోత్సవంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి విరాటపర్వం వేడుకగా నిర్వహించారు. అర్చకుడు చక్రపాణి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. ఉభయకర్తలుగా సాదా గోపి, నళిని, కొప్పవరపు పాండురంగయ్య, సరోజనమ్మ, చంద్రశేఖర్, రష్మి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈఓ జానకి పాల్గొన్నారు.

➡ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం జరిగిన చప్పరోత్సవంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ సి.రామకృష్ణ, అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంతరాయాల్లేకుండా విద్యుత్ సరఫరా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రొట్టెల పండగకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ నోడల్ అధికారి శేషాద్రిబాలచంద్ర అన్నారు. దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన దుకాణాల వైరింగ్ పనులను ఆయన ఆదివారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు షిఫ్టుల్లో విద్యుత్ సిబ్బంది నిరంతరం విధుల్లో ఉంటారని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకుంటారన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. టౌన్ ఈఈ శ్రీధర్, ఎంఆర్‌టీ విభాగపు ఈఈ లక్ష్మీనారాయణ, డీఈఈ అశోక్ ఉన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



నెల్లూరు(బృందావనం): నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న బాప్టిస్టు చర్చి డొనీహాల్లో చాంబర్స్ మెమోరియల్ డొనీహాల్ ఇంగ్లిష్ వర్షిప్ సర్వీస్ వార్షికోత్సవ మహోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ఇంగ్లిష్ సర్వీస్ చాప్లిన్ రెవరెండ్ డేవిడ్ లివింగ్‌స్టన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెవరెండ్ డాక్టర్ సి.రాజ్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. కె.రాజకుమారి జయకుమార్, ఎ.శరత్‌స్టీవెన్‌సన్, బర్సార్, టి.ప్రేమ లివింగ్‌స్టన్, వై.శారాప్రవీణ, డేవిడ్ దయాసాగర్, కె.హరిపాల్, పి.జానీజో, కృపారాజన్, రజనేష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ర్యాలీ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈనెల 9న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. వేదాయపాళెం సెంటర్ నుంచి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహం వరకు సాగిన ర్యాలీలో సీఐటీయూ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు కొండా ప్రసాద్, పెంచలనరసయ్య మాట్లాడుతూ కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

భక్తులకు గంధం అందేలా చూస్తాం

నెల్లూరు(బృందావనం): బారాషహీద్‌లను దర్శించుకునే భక్తులందరికీ ఈ ఏడాది గంధం అందేలా చర్యలు చేపట్టామని రొట్టెల పండగ కమిటీ చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. దర్గా వద్ద ఆదివారం ఆయన మాట్లాడారు. దర్గా ప్రాంగణాన్ని జోన్‌ల వారీగా విభజించి కమిటీ, స్వచ్ఛంద సేవకుల సభ్యులతో ఆయా ప్రాంతాల్లో ఉంచి 24 గంటలపాటు పర్యవేక్షిస్తున్నామన్నారు. సోమ, మంగళవారాల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. భక్తులు ఎటువంటి సమస్య లేకుండా బారాషహీద్‌లను దర్శించుకుని వెళ్తున్నట్లు చెప్పారు.

మంత్రి దృష్టికి డీహెచ్‌ఈఓల సమస్యలు

నెల్లూరు(అర్బన్): డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేజర్ల సుధాకర్‌రావు మంత్రి పొంగూరు నారాయణను కోరారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. అనంతరం పలువురు రాష్ట్ర నాయకులు మంత్రి నారాయణను ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలను వివరించారు. అసోసియేషన్ రాష్ట్రాధ్యక్షుడు వెంకటరమణ, కోశాధికారి హరిప్రసాద్, కార్యవర్గ సభ్యులు అనూరాధ, సరోజిని, శివరామకృష్ణ, కృష్ణమోహన్, రమణ, ప్రసాద్, సయ్యద్ బేగం, కృష్ణశేఖర్, విజయభాస్కర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. గత నెల 26న వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి(45) అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. స్థానికులు గుర్తించి 108కు సమాచారం అందించారు. వారు సదరు వ్యక్తిని జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందారు. ఈ మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉదయ్‌భాస్కర్‌కు డాక్టరేట్



నెల్లూరు (టౌన్): వెంకటాచలం మండలం సర్వేపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న విశ్వరాజు ఉదయ్‌భాస్కర్‌కు డాక్టరేట్ లభించింది. తిరుపతిలోని ఎస్వీ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ స్టాన్‌లీ జయకుమార్ పర్యవేక్షణలో సోషియాలజీ విభాగంలో సోషల్ ఆస్పెక్ట్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ స్టడీ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన గావించారు. దీంతో ఈయనకు వర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

స్థానిక పీఠాధిపతులకు అవకాశమివ్వాలి

నెల్లూరు(బృందావనం): రొట్టెల పండగలో జరిగే గంధ మహోత్సవంలో జిల్లాలోని పీఠాధిపతులకు అవకాశం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని చిన్నబజార్‌లో ఖాజా పీర్ మకాన్‌లో జిల్లా పీఠాధిపతులు, ముషాయక్ సంఘం పీఠాధిపతుల సమావేశం ఆదివారం జరిగింది. కేఎస్ఏఎస్ బాబాసాహెబ్ బంధానవాజ్, ఫయాజ్ రజ్వీ సాహెబ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు ఆహ్వానం అందలేదన్నారు. అయితే రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం నుంచి తమకు అనుకూలంగా ఆదేశాలు వస్తే స్థానిక పీఠాధిపతులుగా సోమవారం రాత్రి నిర్వహించే గంధమహోత్సవంలో పాల్గొంటామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో..



వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..



రంగనాథస్వామి దేవస్థానంలో..

నెల్లూరు(బృందావనం): తొలి ఏకాదశి సందర్భంగా మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం స్వామివార్లకు అభిషేకార్చనలు, పూజలు, రాత్రి నగరోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా పల్లం విజయకుమార్‌రెడ్డి– వసంత దంపతులు వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

➡ నెల్లూరు(వీఆర్సీసెంటర్): తొలి ఏకాదశి సందర్భంగా వెంకటేశ్వరపురంలో కొలువైన ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామివార్లను శేష వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకుడు సాయి భరద్వాజ, ఆలయ కమిటీ చైర్మన్ నాగిరెడ్డి పర్యవేక్షించారు.

➡ నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామికి ఆదివారం 108 లీటర్ల పాలతో తిరుమంజనం నిర్వహించారు. రాత్రి బంగారు గరుడసేవ పేట ఉత్సవం జరిగింది. ఈఓ ఎ.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

రాష్ట్రంలో మందగించిన రియల్ వ్యాపారం

నెల్లూరు(బారకాసు): రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించిందని, దీనివల్ల మధ్యవర్తులు వ్యాపారం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణగౌడ్ అన్నారు. స్థానిక మాగుంట లేఅవుట్‌లోని రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ కార్యాలయంలో సంఘ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ప్రాంతాల్లో వేసిన వెంచర్లు అమ్ముడుపోకుండా ఉండిపోతున్నాయని, కట్టిన బిల్డింగులు విక్రయించలేక నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా రియల్ ఎస్టేట్ అనుబంధ రంగాలు కూడా కుదేలయ్యాయని వివరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడిగా కందుకూరు శ్రీనివాసతేజను ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాన్ని అందించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామెర్ల శివకుమార్, జిల్లా నాయకులు అవినాష్, ఉదయ్, మధు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



సతీష్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కపాడిపాళెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సతీష్ మాతృమూర్తి వేలంగణమ్మ ఆదివారం మృతిచెందడంతో ఆమె భౌతికకాయానికి పార్టీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా కపాడిపాళెం పెద్దబావి సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్త లక్ష్మీనరసింహులు మాతృమూర్తి ఆదిలక్ష్మమ్మ మృతిచెందడంతో ఆమె భౌతికకాయానికి ఎమ్మెల్సీ నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థించి, వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు.

రెండు పూరిళ్లు దగ్ధం

నెల్లూరు(క్రైమ్): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధమైన ఘటన నగరంలోని మద్రాస్ బస్టాండ్ సమీపంలోని సరోజిని నగర్ (జూబ్లీ హాస్పిటల్ రోడ్డు)లో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సరోజిని నగర్‌లో చెంచులక్ష్మి, లక్ష్మి పక్కపక్క ఇళ్లలో నివాసం ఉంటున్నారు. ఆదివారం వారు పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఈక్రమంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటల్ని ఆర్పారు. అయితే అప్పటికే ఇళ్లు అగ్నికి దగ్ధమయ్యాయి. పూరిళ్లు కావడంతో మంటలు ఉవ్వెత్తున ఎగసిపడి నిమిషాల్లోనే సర్వం దగ్ధమైంది. ఒక్కో ఇంట్లో రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

గ్రాట్యుటీ మంజూరు చేయాలి

నెల్లూరు (టౌన్): విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీని వెంటనే మంజూరు చేయాలని ఎస్టీయూ గౌరవాధ్యక్షుడు రాజమనోహర్, ప్రధాన కార్యదర్శి నిరసింహ కోరారు. స్థానిక ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల పిల్లల వివాహాలు, ఇళ్ల నిర్మాణం లాంటి అవసరమైన పనులు ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగా రిటైర్మెంట్ రోజునే మొత్తం గ్రాట్యుటీ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

10న పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

నెల్లూరు (టౌన్)/నెల్లూరు రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని 3,555 పాఠశాలలు, 143 కళాశాలల్లో ఈనెల 10న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్, డీఈఓ ఆర్.బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని విద్యార్థులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులను ఆహ్వానించి కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

వెంకటేశ్వర్లుకు వీఆర్ స్కూల్లో చోటు



నెల్లూరు(బారకాసు): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో యాచకుడిగా తిరుగుతున్న బాలుడు వెంకటేశ్వర్లుకు వీఆర్ పాఠశాలలో చోటు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ నందన్ తెలిపారు. ఈ మేరకు బాలుడికి అవసరమైన బ్యాగ్, పుస్తకాలు, ఇతర సామగ్రిని కమిషనర్ ఆదివారం స్వయంగా అందజేశారు.

రోల్ మోడల్‌గా వీఆర్ హైస్కూల్

నెల్లూరు (టౌన్): వీఆర్ హైస్కూల్‌ను దేశంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. నగరంలోని వీఆర్ హైస్కూల్లో జరుగుతున్న పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ వీఆర్ హైస్కూల్‌ను సోమవారం ఉదయం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. రవాణా కోసం పది బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, ప్రతి విద్యార్థికి ప్రభుత్వం ఇచ్చే రెండు జతల యూనిఫాంతో పాటు నారాయణ సంస్థలు నాలుగు జతల యూనిఫామ్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, పొంగూరు షరిణి, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

➡ వీఆర్ హైస్కూల్‌ను అద్భుతంగా తీర్చిదిద్దిన మంత్రి నారాయణ పేరు చరిత్రలో నిలిచిపోతుందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మంత్రి నారాయణతో కలిసి వీఆర్ హైస్కూల్‌ను పరిశీలించారు. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బీఈఈయూ కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ బహుజన ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (ఏపీ బీఈఈయూ) జిల్లా సర్కిల్ కమిటీ ఎన్నిక ఆదివారం దర్గామిట్టలో నిర్వహించారు. కన్వీనర్‌గా పి.లక్ష్మీప్రసన్న, కో–కన్వీనర్లుగా రాకేష్, పెంచలప్రసాద్, బుజ్జయ్య, నిరంజన్‌లను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ తేళ్ల అంజయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పులి చంద్రశేఖర్ హాజరయ్యారు.

యోగాపై శిక్షణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపంలో ఆదివారం యోగా శిక్షణా తరగతులు నిర్వహించారు. శిక్షకుడు సురేష్‌రెడ్డి యోగాసనాలు వేయించి ధ్యానం గురించి వివరించారు. ఈఓ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.